# వృత్తిధర్మం

ఎ.ఆర్.స్వామి

'నాన్నగారూ! మీ ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తే ఇక లాభం లేదు. మీకు 78వ సంవత్సరం నిండింది. అదేదో మామూలు ఆయాసం, అలసట వల్ల వచ్చిందే గాని, నా ఆరోగ్యానికేమీ పరవాలేదు, అని ఊరుకుంటే, తరువాత చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభం లేదు. మనం ఎలాగూ ఆ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు వెళ్ళలేం గనుక మన ఊరిలోనే మన అదృష్టం కొద్దీ పెద్ద పేరున్న ప్రభుత్వ ఆసుపత్రి ఉందిగా పదండి నేనొక రోజు ఆఫీసుకి శలవు పెట్టి మీకు అక్కడ పరీక్షలు చేయిస్తాను'.




'ఒరే రామం! నేను ఊహ ఎరిగిన నాటినుండి ఇప్పటి ఆసుపత్రి ముఖం అయినా ఆ ఆ. వైద్యులూ, పరీక్షలూ అంటే నాకు పరమ చిరాకు.; నువ్వు నీ ఆఫీసు పనిచూసుకో. ఓ రెండు రోజులు పోతే ఆయాసం అదే సర్దుకుంటుంది'. అన్నాడు రామం తండ్రి.

'అలా మీరు ఆయాసంతో బాధపడుతూ ఉంటే మేము చూస్తూ ఊరుకోలేము కదా! నిన్నరాత్రి గుండెనొప్పి వచ్చి ఆయాసం ఎక్కువయిందన్నారుగా! మనం రేపే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్దాము'.

అది ఆసుపత్రిలో ఐ.సి.సి.యు వార్డు. వలయాకారంలో ఉన్న ఆవార్డులో రమారమి పన్నెండు గదులున్నాయి. వలయాకార మధ్యభాగంలో లోగిలిలా ఉండి ఒకవారగా కొన్ని పడకలున్నాయి. మరో వారగా కొంతభాగంలో రెండు టేబుల్స్ ఉన్నాయి. వాటిపై చిందర వందరగా పడేసి ఉన్న మందుల స్ట్రిప్స్, వైద్యపరికరాలు స్టెతస్కోపులు ఉన్నాయి. ఆ టేబుల్స్ కి చెరోప్రక్క ఇద్దరు నర్సులు కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.

'ఏమేవ్! కునుకు పాట్లు పడుతున్నావ్! రాత్రంతా నిద్రలేదా ఏమిటి ?

లేదే ! నిన్న నేను, మా ఆయన సెకండు షో సినీమాకి వెళ్ళాం అదే హేంగోవరు.'అంతేనా లేక మీ ఆయనతో రాత్రంతా ఓవర్ టైమ్ చేశావా ' కిలకిలానవ్వారు ఇద్దరూ.

ఇంతలో ఒక రోగి బంధువు ఆందోళన చెందుతూ వచ్చి ...

'సిస్టర్ ! సిస్టర్ ! మారూములో డస్ట్‌బిన్ గాని, బాత్ రూములో ఒక 'మగ్' గానీ లేవు. మాకు ఇబ్బందిగా ఉంది. ఎవరినడగాలి సిస్టర్?'

'వెళ్ళవయ్యా ! నీకు అన్నీ విడమర్చి చెప్పాలా. ఇది ప్రయివేటు ఆసుపత్రి కాదు. రూముల్లో ఫైవ్ స్టార్ సౌకర్యాలుండటానికి ఇది ప్రభుత్వాసుపత్రి. అక్కడ సింహాచలం అనే వార్డుబాయ్ ఉంటాడు వాడికి మామూలు ఇచ్చావంటే అన్నీ వాడే సమకూరుస్తాడు. నా దగ్గర అడిగితే ఏం లాభం ? అని విసుక్కుంది ఒకనర్సు.

' మా ఖర్మకొద్దీ, ఆర్థిక స్తోమత లేక, ప్రయివేటు ఆస్పత్రులకిడబ్బు వెదజల్ల లేక ఈ ప్రభుత్వాసుపత్రులకొస్తాము. ఇక్కడ చూస్తే లంచాలిచ్చిన వారికి రాచమర్యాదలు, లంచాలివ్వని వారికి వసారా సేవలు. గదుల్లో రోగికి కనీస వసతులు, కూడా ఉండవు. పేరుకి

వార్డు. పైగా ఈ మధ్య యూజర్ చార్జీలని మాదగ్గర నుండి వసూలు చేస్తున్నారు. అని తన ఆవేదన వెళ్ళబుచ్చాడు ఆ రోగి బంధువు.

అతని మాట లేవీ పట్టించుకోకుండా ఆ నర్సు హడావుడిగా ఒక రూములో దూరింది. రామం, అతని తండ్రి ఆ వార్డులోకి ప్రవేశించారు.

'సార్ ! మా నాన్నగారు గతరాత్రి నుండి ఎక్కువ ఆయాసంతో బాధపడుతున్నారు. రాత్రంతా నిద్రపోలేదు. ఆహారం కూడా ఏమీ తీసుకోలేక పోయారు. అందుకని చెకప్ చేయించడానికి వస్తే ఒ.పి.డి.లో ఈ వార్డుకి వెంటనే వెళ్ళమని చెప్పారు. అందుకని ఇక్కడికి వచ్చాంసార్ ? డ్యూటీలో ఉన్న డాక్టర్ కి చెప్పాడు రామం.

' ఏదీ ఆ చీటి ఇలా ఇవ్వండి' అని ఆచీటీని తెరిపార చూసి' అక్కడ ఉన్న బెడ్‌మీద మీ నాన్న గారిని పడుకోబెట్టండి' అన్నాడు ఆడ్యూటీ డాక్టర్.

తరువాత కొంతసేపు బి.పి., ఇ.సి.జి., బ్లడ్‌షుగర్ ఇలా కొన్ని పరీక్షలు జరిపి...

'మీ నాన్నగారి ఆరోగ్య పరిస్థితి ఏం బాగోలేదు. ఆయన్ని కొన్ని రొజులు అబ్జర్వ్ చెయ్యాలి. ఆయన పల్స్ రేటు బాగాపడిపోయింది. అశ్రద్ధ చేస్తే చాలా కష్టం. వెంటనే జాయిన్ చెయ్యండి' అని రామంతో అన్నాడు డ్యూటీ డాక్టర్.

'నేను ఆయన్ని ఆసుపత్రిలో జాయిన్ చేయడానికి సిద్ధమై రాలేదు రేపు వచ్చి జాయిన్ చేయొచ్చా' అని అమాయకంగా అడిగాడు రామం.

'ఆయన పరిస్థితి బాగోలేదు. వెంటనే జాయిన్ చెయ్యాలి అంటే, రేపంటావేమిటి ? తక్షణమే జాయిన్ చెయ్యాలి' అని విసురుగా చెప్పాడు డ్యూటీ డాక్టర్.

'సరే నండీ '

'అదిగో ఆమూల ఉన్న ఆరోనంబరు రూములో పడుకోబెట్టండి ఇప్పుడే వస్తాను' అంటూ వేరే రూములోకి వెళ్ళిపోయాడు ఆ డాక్టర్.

ఆరో నంబరు రూము మధ్యలో ఒక ఉగిసలాడే ఇనుపమంచం. దానిపై మురికిగా వాసన కొడుతున్న తలదిండు చూసి రామానికి కడుపు దేవేసింది. వార్డుబాయ్ సింహాచలానికి దక్షిణ చెల్లించి ప్రక్కపై ఒక ఉతికిన దుప్పటి వేయించి, బాత్‌రూమ్ క్లీన్ చేయించి ఒక డస్ట్‌బిన్ ఏర్పాటు చేయించాడు. తండ్రిని మెల్లగా రూములోకి తీసుకువచ్చి అమర్చిన ప్రక్కపై తండ్రిని మెల్లగా పడుకో బెట్టాడు.

రామం రోజూ ఉదయాన్నే ఆరుగంటలకి ఇంటినుండి బయలుదేరి పదిహేను కి.మీ. దూరంలో ఉన్న ఆసుపత్రికి రోజూ ఉదయం ఏడు గంటలకి చేరుకునేవాడు. తండ్రి పడక ప్రక్కనే కూర్చుని రాత్రి తొమ్మిది గంటల వరకూ సేవలు చేస్తూ వచ్చాడు. రాత్రి తొమ్మిది గంటలకి రామం తమ్ముడు రావడం. ఉదయం వరకు తమ్ముడు కాపలా కాయడం ఇలా వారం గడచినా డాక్టర్లు తన తండ్రి వైద్యం విషయంలో ఏ నిర్ణయం తీసుకోక పోవడం, ఏ సంగతీ చెప్పక పోవడంతో రామానికి ఆందోళన పెరిగింది.

'ఒరేయ్ ! రామం డాక్టర్లు ఏమంటున్నార్రా! తండ్రి ఆత్రంగా అడిగాడు.

'రిపోర్టులు వచ్చాయి. పల్స్‌రేటు ఇంప్రూవ్ అయితే గానీ ఏవిషయం చెప్పలేమంటున్నారు నాన్నగారూ!'

'అదేమిట్రా ? వారం రోజులు గడిచాయి. చేసిన వైద్యం చూస్తే ఏమీలేదు నేను గమనిస్తూనే ఉన్నాను. వాళ్ళలో వాళ్ళు ఏవో గుసగుసలాడుకుంటున్నారు. ఏవో తర్జన భర్జనలు పడుతున్నారు. అసలు విషయం ఏమిటో కనుక్కో !'

'సరే నాన్న గారూ !'

'ఆరో నంబరు రూములో ఉన్న రోగి పరిస్థితి ఎలా ఉంది ? ' డాక్టర్ సత్యం అసిస్టెంట్ రాజుని అడిగాడు.

'ట్రీట్‌మెంట్‌కి సరైన రెస్పాన్స్ లేదు. పల్స్‌రేటు తక్కువగా ఉంది. అయినా బాస్ వచ్చాక డిస్కస్ చేసి, ఏ విషయం తేలుద్దాం !' అని పోజుకొడుతూ చెప్పాడు అసిస్టెంట్ రాజు.

. . .

'ఆపేషంట్‌ని' '. షేర్ ' ఆస్పత్రికి రిఫర్ చేద్దాం. రావుగారు నిన్న నా డిస్పెన్సరీకి ఫోన్ చేసి ఏమిటి సత్యం గారూ ! ఈ మధ్య మీదగ్గర నుండి 'పేస్ మేకర్' కేసు లేవీ మా 'షేర్' ఆస్పత్రికి రావడం లేదు అన్నారు ! అని సత్యం వాపోయాడు.

'అవును బాసూ ! ప్రస్తుతానికి ఆరోనంబరు కేసు, ఆ పన్నెండో నెంబరు కేసుల్ని 'షేర్' ఆస్పత్రికి పంపి, సాయంత్రం రావుగారితో మాట్లాడి మన షేర్ సెటిల్ చేసుకుందాం' అని చిన్న చిరునవ్వు విసిరాడు రాజు.

ఈలోగా కొత్త కేసు లేవేనా వస్తాయేమో అని ఒకరి భుజంమీద ఒకరు చేయివేసుకుని కేంటీన్ వైపు బయలు దేరారు.

. . .

'ఒరేయ్ రామం డాక్టర్ని నా విషయం గురించి కనుక్కున్నావా ?'

'ఆ ఈ రోజు ఉదయాన్నే కనుక్కున్నాను నాన్నగారూ!'

'ఏ మంటున్నాడు !'

' మీ పల్స్‌రేటు ఇంప్రూవ్ అవడం లేదట. ఏదో 'పేస్‌మేకర్' అనే పరికరం గుండెలో అమర్చాలని, దానికి దాదాపు ఎనభై వేలు ఖర్చవుతుందని అంటున్నారు.

'పేస్‌మేకరు లేదు గీస్‌మేకరు లేదు. నాలుగురోజులు ఇంటి దగ్గర చారూ అన్నం తింటే అదే సర్దుకుంటుంది. అయినా ఒరే రామం ! నాకు ఈ వయసులో పేస్‌మేకర్లు అవీ ఇవీ పెట్టించుకుని కృత్రిమంగా నా ఆయుష్షుని పెంచుకోవాలనే ఆశలేదురా ! ఏదో బ్రతికినంత కాలం సహజంగానే బతకాలని ఉంది. నువ్వు వెంటనే చీఫ్‌తో మాట్లాడి నేను డిస్చార్జ్ అయ్యే ఏర్పాట్లు చూడు. ఈ వారం రోజులూ వాళ్ళు ఏ వైద్యం చేసిందీ లేదు చచ్చింది లేదు. పైగా నన్ను ఏమీ తిననీయడం లేదు కూడానూ !

' అలా చిరాకు పడితే ఎలా నాన్నగారూ ! కొంచెం ఓపిక పట్టండి. మందులతో ఏమైనా నయం అవుతుందేమో కనుక్కుందాం !'

'వారం రోజుల నుండి నరాల కెక్కిస్తున్న ఆసెలైన్ బాటిల్ నీళ్ళు తప్ప నోటికి వేరే ఏమీ అందలేదు. నీరసంగా ఉందిరా ! అలా బయటికి వెళ్ళి తినడానికి ఏమైనా పళ్ళుకొని తీసుకురా !' అన్నాడు తండ్రి.

రామం అల్లా ఆస్పత్రి మెయిన్ గేటు దాకా వెళ్ళి ఏమైనా పండ్ల దుకాణాలున్నాయేమో అని వెతగ్గా, అరవై ఏళ్ళు పై బడిన ఒక ముసలమ్మ ఆస్పత్రి మెయిన్ గేటుకి ఒక వారగా కూర్చుని గంపతో సపోటా పళ్ళు అమ్ముకుంటూ కనిపించింది రామానికి.

'సపోటాలు డజను ఎలాగమ్మా ? '

'పది రూపాయలు బాబూ !'

'సరే ! ఒక డజను బాగా మగ్గిన పళ్ళు చూసి ఇవ్వమ్మా !'

'అలాగే ! నువ్వే ఎంచుకో బాబూ ! అని ఒక పాలితిన్ సంచీ రామం చేతి కందించింది ఆ ముసలమ్మ.

రామం బాగా మగ్గిన పళ్ళు ఒక డజను ఎంచి ఆ బాగ్‌లో వేసుకుని తిరిగి వార్డుకు వచ్చి ఆ పళ్ళ సంచీ తండ్రి చేతి కందించాడు.

'హమ్మయ్య ! ప్రాణం లేచి వచ్చిందిరా రామం! పళ్ళు చాలా తియ్యగా ఉన్నాయి !'

తండ్రి ఇష్టంగా ఆ పళ్ళను తినడం చూసి రామానికి చాలా సంతోషం వేసింది. పళ్ళ ముసలమ్మకు మనసులో కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

డాక్టర్లు తండ్రికి ఆహారం ఇవ్వకూడదన్నారని, రామం రోజూ ఆ పళ్ళమ్ముకునే ముసలమ్మ దగ్గరికి వెళ్ళి ఒక పదిరూపాయల పళ్ళుకొని రోజు తండ్రికి ఇస్తూ వచ్చాడు. ఆ ముసలమ్మతో కొద్దిగా పరిచయమయ్యింది రామానికి.

' ఏం బాబూ! ఎవరికి సుస్తీ చేసింది ?" ఆస్పత్రిలో ఎవరున్నారు ?'

అభిమానం ఆప్యాయతలను మేళవించిన భావంతో అడిగింది ఆ ముసలమ్మ.

'మా నాన్నగారికి కొంచెం ఆయాసంగా ఉంటే ఆస్పత్రిలో చేర్పించానమ్మా !'

ఆదేముడు అందర్నీ చల్లగా చూస్తాడు బాబూ ! పరవాలేదు త్వరగా నయమయి మీరు సంతోషంగా ఇంటికి వెళ్తారు అని దీవించింది.

ఆస్పత్రి వాతావరణం నుండి అప్పుడప్పుడు బయటికి వచ్చి, ఆ ముసలమ్మతో ఆప్యాయంగా కొంతసేపు మాట్లాడటం వలన, ఆ ముసలమ్మ పరిచయం వలన ఆముసలమ్మపై రామానికి ఒక విధమైన ప్రేమ అనురాగం ఏర్పడ్డాయి.

' ఒరే రామం ! ఆ డాక్టర్లు ఇచ్చే మందుల కంటే ఈ సపోటాలు కొంత నాకు ఉపశమనం కలిగిస్తున్నాయిరా

రామం కూడా తండ్రి ఆరోగ్యంలో ఈ మార్పు గమనించాడు.'ఒరేయ్ ! రామం! ఈ వైద్యుల తర్జన భర్జనలు మాటిమాటికి గుమికూడి జరిపే గుసగుసలు చూస్తుంటే నాకేదో అనుమానంగా ఉందిరా ! జీతం తీసుకుంటూ రోగులకి నిస్వార్థమైన సేవలందించాల్సిన వీళ్ళు వారి వారి ప్రయోజనాలు చూసుకుంటూ స్వార్థంగా వ్యవహరించడం, ప్రయివేటు ఆస్పత్రులతో సంబంధాలేర్పరుచుకుని బ్రోకర్లలా వ్యవహరించడం చూస్తుంటే నాకు కంపరం పుడుతోందిరా !'

'అవును ! నాన్నగారూ ! వాళ్ళ రేట్లు, వాళ్ళ షేర్లు మాట్లాడుకుంటున్నారే గాని రోగులవైద్యం విషయంలో శ్రద్ధవహిస్తున్నట్లు నాకు కనుపించడం లేదు.

'అందుకే నాకు ఒక్క క్షణం కూడా ఇక్కడ ఉండాలని లేదు. ఈ వైద్యం మీద నమ్మకం పోయింది. నువ్వు వెంటనే ఆ చీఫ్ తో మాట్లాడి నన్ను డిస్చార్జ్ చేసే ఏర్పాట్లు చూడు !' అని తన ఉద్దేశ్యాన్ని ఖరాకండీగా చెప్పాడు రామం తండ్రి.

సరేనాన్న గారూ ! రేపే చీఫ్ తో మాట్లాడుతాను. 'అన్నాడు రామం. సమయం ఉదయం తొమ్మిది గంటలు కావస్తోంది. ఆస్పత్రిలో ICCU వార్డులో అకస్మాత్తుగా క్రమశిక్షణ మొదలయింది. స్టాఫ్ అంతా ఎవరి పనులు వారు చకచకా చేసేస్తున్నారు. ఈ ఆకస్మిక పరిణామానికి రామం ఆశ్చర్యపడ్డాడు. సుమారు యాభై సంవత్సరాలు పై బడిన ఆజాను బాహుడు చీఫ్ గోపాల్.

'చీఫ్ ' రోగులందరి యోగక్షేమాలు కనుక్కొంటూ, వారి వారి 'కేస్‌షీట్‌లు' స్టడీ చేసి అసిస్టెంట్స్‌కి రోగికి ఇచ్చేమందులు, వైద్యం విషయంలో ఏవో సలహాలిస్తూ ఒక్కొక్క పేషంట్‌ని వరుసగా చూస్తూ రామం తండ్రి బెడ్ దగ్గరకు వచ్చాడు.

' సార్ ! మానాన్నగారు ఈ వయసులో పేస్‌మేకర్ వేయించుకోడానికి సుముఖంగా లేరు. అదీకాక, మాలాటి సామాన్యులకు డెబ్బై, ఎనభైవేల ఖర్చు భరించే స్తోమత ఎక్కడిది. మందులతో నయమయ్యే మార్గం ఏదైనా ఉంటే చూడండి సార్ ! అని ప్రాధేయపడుతూ చీఫ్‌ని అడిగాడు రామం.

'మీ నాన్నగారి ప్రాణం కాపాడుకోవాలంటే 'పేస్‌మేకరు' వేయక తప్పదు. ఇటువంటి సమయంలో ఏ అప్పో సప్పో చేసి డబ్బు ఏదో విధంగా అమర్చుకోవాలయ్యా ! మీ ఆర్థిక స్తోమత గురించి నాకెందుకయ్యా చెప్తావ్ ! అంటూ, రామం మాట్లాడ టానికి ఎక్కువ అవకాశం ఇవ్వకుండా ప్రక్కరూములో ఉన్న మరో పేషంట్ దగ్గరికి వెళ్ళిపోయాడు 'చీఫ్'.

రామం తండ్రి డిస్‌చార్జ్ అయిపోతానని పట్టుబట్టడంతో, చీఫ్‌తో తన తండ్రి 'డిస్‌చార్జి' విషయమై మాట్లాడుదామని చీఫ్ చాంబర్ దగ్గరకి వచ్చాడు రామం.

'రాజూ ! ఆ ఆరోనంబరు వార్డు పేషంట్‌ని పేస్‌మేకర్' వేయించుకోవడానికి కన్విన్స్ చేశారా ?' ప్రశ్నించాడు చీఫ్ గోపాల్.

'ప్రయత్నిస్తున్నాను సార్ ! ఇందాక వాళ్ళబ్బాయికి పేస్‌మేకర్ వేయించుకోకపోతే మీ నాన్నగారు బ్రతకడం కష్టం అని కచ్చితంగా చెప్పాను' అన్నాడు అసిస్టెంట్ రాజు.

'నిన్న 'షేర్ ' హాస్పటల్ రావు గారిని కలిశావా ?'

'లేదు సార్ ! మొన్న రావుగారు నాకు ఫోను చేసి 'పేస్‌మేకర్' కేసులు తగ్గిపోతున్నాయి. మన ఆస్పత్రి కేసు లేమైనా ఉంటే కొన్ని పంపించమన్నారు.

' ఆ నాలుగోనంబరు రూము కేసుతో కలిసి ఈ వారంలో మొత్తం అయిదు కేసులు పంపాము గా ! ఇప్పుడు ఈ ఆరోనంబరు కేసుకూడాఒప్పుకుంటే మొత్తం ఆరవుతాయి!'

' ఏమోసార్ '! ఆ ఆరోనంబరు కేసు తెగేటట్లు కనుపించడం లేదు ' చీఫ్ ఛాంబర్ దగ్గర ఉన్న రామం ఈ సంబాషణలు వినడం తటస్థించింది. రామం ఒక్కసారి అవాక్కయి పోయాడు. చీఫ్ కూడా ఈ పేస్‌మేకర్ల రాకెట్‌లో భాగమేనని నిర్ధారించుకున్నాడు. ఇక ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయక తండ్రిని తక్షణమే ఈ వైద్యుల కబంధహస్తాల నుండి తప్పించి తండ్రిని వెంటనే డిస్‌చార్జ్ చేయించి ఇంటికి తీసుకొని పోదామని నిశ్చయించుకున్నాడు రామం.

చీఫ్ చాంబర్ లోకి వెళ్ళి ...

'సార్ ! మా నాన్నగారు పేస్‌మేకరు చేయించుకోనంటున్నారు మానాన్నగారికి ఇంటి దగ్గరే వైద్యం చేయిస్తాను. వెంటనే డిస్చార్జ్ చేయడానికి ఏర్పాట్లు చేయండి సార్ ! అని ప్రార్థించాడు.

'సరే ! మీ ఇష్టం ! మా సలహాకి వ్యతిరేకంగా మీరు రోగిని ఇంటికి తీసుకు వెళ్ళదలుచుకుంటే, రోగికి ఏమైనా అయితే దానికి పూర్తి బాధ్యత మీరే వహించ వలసి ఉంటుంది.' అన్నాడు చీఫ్.

'అలాగే సార్ ! ఆ బాధ్యత నేనే వహిస్తాను.'

'అయితే కేస్‌షీట్ మీద, మీ బాధ్యతమీదే, వైద్యసలహాకు వ్యతిరేకంగా రోగిని డిస్‌చార్జ్ చేసి తీసుకువెళ్తున్నట్లు వ్రాసి సంతకం పెట్టండి !' అని విసుగ్గా సమాధానమిచ్చాడు చీఫ్.

'ఓయ్ ! రాజా ! ఆ ఆరోనంబరు పేషంట్‌ని వెంటనే డిస్‌చార్జ్ చేసి కేస్‌షీట్ మీద సర్టిఫికేట్ వ్రాసి సంతకం తీసుకో ! అని అసిస్టెంట్ రాజుకి ఆర్డర్ వేశాడు.

రామం కేసు షీట్ మీద సంతకం చేసి, వార్డ్ బాయ్‌ల మామూళ్ళు వాళ్ళకి అప్పజెప్పి రూములోని తండ్రి బట్టలు సామాను సర్ది బ్రతుకు జీవుడా ! అనుకుంటూ తనతండ్రిని యమలోకం నుంచి మానవలోకంలోనికి తీసుకువచ్చినంతగా ఆనందించాడు. ఈ ఆస్పత్రి నరకం నుండి బయటపడినందుకు మనసులో దేముడ్ని పదేపదే ప్రార్థించాడు. తండ్రిని మెల్లగా ఆస్పత్రిబయటకు నడిపించుకుని వస్తుండగా మెయిన్ గేటు దగ్గర ఎవరో పిలిచినట్లయి ఒకక్షణం ఆగాడు.

'బాబూ ! ఈ రోజు సపోటాపళ్ళు తీసుకోవడానికి రాలేదేం ? ఆప్యాయంగా అడిగింది పళ్ళమ్ముకునే ముదుసలి.

'ఈ రోజు మా నాన్నగారిని డిస్‌ఛార్జ్ చేసారమ్మా! అయినా నువ్వు అడిగావు గనుక ఈరోజు రెండు డజన్లు ఇయ్యి అని అమితానందంతో ఆవిడ చేతిలో రెండుపదిరూపాయల నోట్లు పెట్టాడు.

మంచిది బాబూ ! అంటూ రెండు డజన్లు బాగా మగ్గిన పళ్ళు ప్లాస్టిక్ సంచీలో వేసి రామం చేతి కందించింది ముసలమ్మ.

పళ్ళు ఆమెదగ్గర నుండి తీసుకుని మెల్లగా తండ్రితో ఆటోస్టాండుకి వచ్చి ఆటో మాట్లాడి ఇంటికి బయలుదేరారు రామం అతని తండ్రి.

'నాన్నగారూ ! ఈమె దగ్గరే నేను రోజూ పళ్ళుకొని మీకు తెచ్చేవాడ్ని !'

'ఒరే రామం ! మనిషి ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న ఆ వైద్యులు, వాళ్ళిచ్చిన పనికిరాని మందులు కంటె ఆ ముసలమ్మ చేస్తున్న న్యాయమైన వ్యాపారం, ఆమె ఇచ్చిన మేలైన సపోటాలు నాకెంతో మేలు చేసాయనిపిస్తోందిరా !

'నిజమే ! నాన్నగారూ ! విధినిర్వహణలో ఇలా అవినీతితో అన్యాయంగా వ్యవహరిస్తున్న వైద్యుల కంటె న్యాయంగా పండ్ల వ్యాపారం చేసుకుంటున్న ఆముసలమ్మ వేయిరెట్లు మెరుగనిపిస్తోంది.

ఆటో అరగంట ప్రయాణం తరువాత ఇల్లు చేరింది. రామం అతని తండ్రి క్షేమంగా ఇల్లు చేరారు. 'పేస్‌మేకర్' కథ కంచికి చేరింది. విశేషమేమంటే రామం తండ్రి చారు అన్నంతిని పదిరోజుల్లో మామూలు మనిషయ్యాడు. సంపూర్ణ ఆరోగ్యాన్ని తిరిగి సమకూర్చుకున్నాడు.

❀ ❀ ❀